ప్రజాశక్తి
గురువారం 17 జూలై 2025
5
అల్లూరి సీతారామరాజు

ఎఫ్‌సిఐ అధికారుల ఆకస్మిక తనిఖీలు

తనిఖీలు చేస్తున్న ఎఫ్‌సిఐ సిజిఎం రాజగోపాల్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏజెన్సీలోని డుంబ్రిగుడ,అరకులోయ మండలాల్లో విశాఖపట్నం ఎఫ్‌సిఐ అధికారులు బుధవారం సందర్శించి తనిఖీ చేశారు. ఎఫ్‌సిఐ సిజిఎం ఎ.రాజగోపాల్ ఆధ్వర్యంలో అధికారుల బృందం అరకులోయ ఎంఎల్ఎస్ పాయింట్‌ను, యండపల్లివలస డీలర్ డిపో, డుంబ్రిగుడ ఆర్‌బికె కేంద్రాలను పరిశీలించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సివిల్ సప్లై ద్వారా రేషన్ అందుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌సిఐ డివిజనల్ మేనేజర్ జి సునీల్ కుమార్, విశాఖ డిపో మేనేజర్, టి తేజ నవీన్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ కె నరేష్ కుమార్,జిల్లా డి ఎస్ ఓ మోహన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం!

- మాతాశిశు మరణాలను నియంత్రించండి
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - పాడేరు :మన్యంలో మాతా శిశు మరణాలను నియంత్రించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో ప్రసవంలో తల్లీ,బిడ్డ మరణాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని, మదర్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డు నిర్వహణ కీలకమని ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతాశిశు మరణాలపై వైద్య ఆరోగ్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 2025 నుండి నేటివరకు జిల్లాలో జరిగిన మాతా, శిశు మరణాలకు కారణాలు ఒక్కొక్కటి రికార్డులతో సంబంధిత మెడికల్ ఆఫీసర్స్ సంబంధిత ఆశా, ఎఎన్ఎమ్ లతో సమీక్షించారు. మరణాలకు కారణాలు ఆరాతీశారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. హైబిపి వల్లే ప్రసవ మరణాలు చోటుచేసుకుంటున్నాయని వైద్యులు చెప్పడంతో సంబంధిత మెడికల్ ఆఫీసర్, కలెక్టర్ పరిశీలించారు, మెడికల్ రికార్డ్ సక్రమంగా నిర్వహించడం లేదని, పలు వివరాలను నమోదు చేయని సంబంధిత వైద్యాధికారులను వివరణ కోరారు. రికార్డుల్లో వివరాలు మారిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులలో డాక్టర్ అందుబాటులో లేని యెడల సూపర్‌వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొని క్యాంపు వివరాలను వైద్యుడికి తెలియజేయాలన్నారు. హై రిస్క్ గర్భవతులను సుఖ ప్రసవం కొరకు ఆసుపత్రికి తీసుకొని వెళ్లడానికి 108 లేదా పిహెచ్‌సి అంబులెన్స్ లు అందుబాటులో లేని పరిస్థితుల్లో హెల్ప్ కాల్ సెంటర్ 6303921374 కు ఫోన్ చేయాలన్నారు. అది కూడా అందుబాటులో లేకుంటే ఐటిడిఎ పిఒ, డిఎంహెచ్‌ఒకు వెంటనే తెలియచేయాలన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలని, సంబంధిత ఆశా వర్కర్లు క్రమం తప్పకుండా మందులు వేసుకుంటున్నారా లేదా పర్యవేక్షించాలన్నారు. దీనికి భాధ్యత వహించాలన్నారు. డాక్టర్లు ఒకటే వరిమితం కాకూడదని, ఎఎన్ఎం, సూపర్‌వైజర్ పని తీరు సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, ఆశా, ఎఎన్ఎమ్‌లపై చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అందుకు పణాళికలు ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు 108, 104 వాహనాలను ముందస్తుగా ఏర్పాటు చేయనుకోవాలని సూచించారు. కింది స్థాయి నుండి పైస్థాయి వరకు హైరిస్క్ కేసులపై ప్రతీ 15 రోజులకు ఒకసారి నివేదికలు అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి. విశ్వేశ్వరనాయుడు, పాడేరు జిజిహెచ్ హెచ్‌ఒడి డాక్టర్ టి నరసింగరావు, గైనకాలజిస్టులు డాక్టర్ సృజన, డాక్టర్ శోభారాణి, డాక్టర్ వాసవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రూబీ భాయ్, డిపిహెచ్ఎన్ఒ జె భూలోకమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధితులను పరామర్శిస్తున్న సురేంద్ర, తదితరులు

ప్రజాశక్తి హుకుంపేట:మండలంలోని గడ్డిమర్రి గ్రామంలో చెరువులో మునిగి మరణించిన చిన్నారుల కుటుంబాలను ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమవతి, మండల కార్యదర్శి టి.కృష్ణారావు బందంతో కలిసి బుధవారం బాధిత కుటుంబాలను సందర్శించి పరామర్శించారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గెమ్మెలి సంతోష్, గెమ్మెలి అఖిల్ అనే చిన్నారులు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన అత్యంత విషాదకరమన్నారు. చనిపోయిన చిన్నారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేగాక, బహిరంగంగా ఉన్న చెరువులకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆశా వర్కర్ల ఖాళీలను భర్తీ చేయండి

మాట్లాడుతున్న సిపిఎం నేత రామారావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని గన్నెల, సుంకరమెట్ట, మాడగడ పిహెచ్‌సిల పరిధిలో ఖాళీగా ఉన్న ఆశావర్కర్ల పోస్టులు భర్తీ చేయాలి సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు డిమాండ్ డిమాండ్ చేశారు. బుధవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇటీవల కొంతమంది ఆశావర్కర్లు ఉద్యోగ విరమణ చేశారని, వారి స్థానాలను భర్తీ చేయలేదన్నారు. ఇటీవల ఆశ కార్యకర్తల భర్తీ నోటిఫికేషన్‌లో ఖాళీలను చూపించలేదన్నారు .గన్నెల పిహెచ్‌సి పరిధిలో బైరేడువలస, డుంబ్రిగూడ, తాంగులబెడ్డ, దాబు గుడ, సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కెబెడ్డగుడ, కిన్నంగుడ, దొడగుడ, బోయిగూడ, మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గెమ్మెలి వలస ,బుడ్యవలస గ్రామాలకు ఆశ కార్యకర్తలుగా పని చేసిన వారు రిటైర్మెంట్ కావడంతో ఆయా స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు.ఆశాలు లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో గిరిజనులకు, ముఖ్యంగా గర్భిణులు,బాలింతలకు వైద్యానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. గిరిజన ప్రాంతంలో రవాణా మార్గం సక్రమంగా లేని పరిస్థితుల్లో ఆశ కార్యకర్తలు అనారోగ్యం పాలైన వారికి ఆసుపత్రిలో చేర్పించే వరకు బాధ్యతగా పనిచేస్తున్నారని తెలిపారు. అటువంటి సేవలు అందించే ఆశ కార్యకర్తల పోస్టులను భర్తీ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం సరికాదన్నారు..ఖాళీగా ఉన్న స్థానాల్లో ఆశ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలన్నారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు గెమ్మెలి చిన్నబాబు, మండల నాయకులు కొర్రా మగ్గన్న, కిల్లో జగన్నాథం పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బాబూనాయక్

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండలంలో పిఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి బాబూనాయక్ సూచించారు. బుధవారం మండలంలో సింగర్భ పంచాయతీ పూలగొంది గ్రామంలో సుడిగాలి పర్యటన చేసి, లబ్ధిదారులతో మాట్లాడారు. పిఎం జన్‌మన్ గృహ నిర్మాణ స్కీమును సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరగా గహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో 34,265 పిఎం జన్‌మన్ ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో 25,795 గృహ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. 8470 గహాలు నిర్మాణాలు పనులు ఇంకా మొదలుపెట్టలేదని , మిగిలిన వాటిని త్వరితగతిన వాటి నిర్మాణ పనులు మొదలు పెట్టాలని లబ్ధిదారులు తెలిపారు మార్చి 2026 నాటికి ఈ స్కీం గడువు ముగిసిపోతుందని లబ్ధిదారులు గమనించాలన్నారు. హౌసింగ్ ఎఇఇ ఈశ్వరరావు వర్క్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

డుంబ్రిగుడలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న డిపిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: దుకాణాలు, పరిసరాల్లో పారిశుధ్యం లోపిస్తే అపరాధ రుసుంతోపాటు చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం ఉదయం మండల కేంద్రం డుంబ్రిగుడలో సందర్శించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. దుకాణాలను పరిశీలించి, డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డుంబ్రిగుడ గ్రామంలో సందర్శించిన ఆయన ఇంటింటికెళ్లి పరిసరాలను శుభ్రం చేసుకుని చెత్త చెదారాలను గతంలో సరఫరా చేసిన చెత్త తొట్టెల్లో వేయాలన్నారు. డ్రైనేజీ, వీధి రోడ్లు నిర్మించాలని గిరిజనులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామనిహామినిచ్చారు. పారిశుధ్య నిర్వాహణ ప్రతిఒక్కరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధించాలన్నారు.. సర్పంచి వెంటకరావు, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఉప సర్పంచి జగ్గునాయుడు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గౌతమి, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలు, సేవా సంస్థల ప్రతినిధులతో నేడు ముఖాముఖి

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పరిశ్రమల శాఖ ద్వారా గతంలో సబ్సిడీ కొరకు దరఖాస్తు చేసుకున్న వివిధ పరిశ్రమలు, సేవా సంస్థల ప్రతినిధులతో ముఖాముఖి సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. ఇంత వరకు హాజరుకాని అభ్యర్థులు పాడేరు ఐటిడిఎలోనిజిల్లా పరిశ్రమల కేంద్రంలో ఈనెల 17న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగు సదస్సుకు వారి పరిశ్రమ, సేవా సంస్థ ఒరిజినల్ పత్రాలతో సంప్రదించాలని సూచించారు. అదనపు సమాచారం కొరకు 8500541363 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

తునికాకు కార్మికులకు నగదు చెల్లించాలి

ఐటిడిఎ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - చింతూరు : 2025 ఏప్రిల్, మే, నెలలో తునికాకు సేకరించిన కార్మికులకు ప్రభుత్వం ఒప్పందం ప్రకారం మూడు రూపాయల 90 పైసలు తక్షణమే చెల్లించాలని, 2021 తునికాకు బోనస్ సేకరించిన కార్మికులకు అందరికీ ఇవ్వాలని, 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్ తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తునికాకు కార్మికులు ఐటిడిఎ వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రధాన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్‌కి అందించారు. పిఒ కార్మికులకు నగదు ఇవ్వడం ఎందుకు ఆలస్యం అవుతోందని వివరణ అడిగారు. తక్షణమే 75 లక్షలు అందుబాటులో ఉన్నాయని వీటిని కార్మికులకు అందిస్తామని, మూడు కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందని సమస్యను త్వరలో పరిష్కరిస్తామని పిఒ హామీ ఇచ్చారు. గిరిజన సంఘం చింతూరు మండల కార్యదర్శి ముత్యమ్ రాజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు సీసం సురేష్, కారక్కాల తదితరులు కార్మికుల సమస్యపై ప్రసంగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేయకపోతే ఐటిడిఎ ఫారెస్ట్ కార్యాలయాల ఎదుట కార్మికులతో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుంజా సీతారామయ్య, కారం సుబ్బారావు, పొడియం లక్ష్మణ్, కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిఒ 3పై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో గిరిజనులకు సంబంధించిన జిఒ నంబర్3పై గిరిజనుల అభిప్రాయాలను సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ యస్.భార్గవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో గిరిజన సంఘాలు, గిరిజన ఉపాధ్యాయ సంఘాలు, న్యాయవాదులు, గిరిజన ప్రతినిధులతో జిఒ నంబర్ 3పై అభిప్రాయ సేకరణ, సూచనలు, సలహాలు వర్క్‌షాప్ ద్వారా గిరిజన సంఘాలకు తెలియజేసే విధంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి, పిఒ కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, రాష్ట్ర న్యాయసలహా అడ్వైజర్ పళ్ళ త్రినాధరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన జిఒ నంబర్ 3 సుప్రీంకోర్టులో రద్దు చేసినందుకు గిరిజన సంఘాలు, గిరిజన ఉపాధ్యాయుల సంఘాలు, న్యాయవాదులు చేసిన ఉద్యమాల ద్వారా జిఒ నంబర్ 3ని తిరిగి పునరుద్దరణ చేయాలని దరఖాస్తులు వచ్చాయని దీనికి స్పందించి గిరిజన ప్రాంతంలో ఉన్న ఐటిడిఎల పరిధిలో వర్క్‌షాప్ ఏర్పాటు చేసి అభిప్రాయాలను స్వీకరించే విధంగా సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వీకరించిన అభిప్రాయాల్లో ముఖ్యమైన వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి, గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శితో చర్చించామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జిఒ నంబర్ 3 ప్రకారం గిరిజన ప్రాంతంలో 4,626 మంది ఉపాధ్యాయులు ఉద్యోగాలు పొందారన్నారు. జిఒ నంబర్ 3 పునరుద్ధరణకు కృషి చేయడం జరుగుతుందన్నారు. పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనుల కోసం ఉమ్మడి రాష్ట్రంలో జిఒ నంబర్ 3 రద్దుపై గిరిజనులు తన దృష్టికి తీసుకువచ్చారని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. రాష్ట్ర గిరిజన అడ్వైజర్ న్యాయవాది పళ్ళ త్రినాధరావు ప్రజెంటేషన్ వర్క్‌షాప్ ద్వారా జిఒ నంబర్ 3 కోర్టులో ఎందుకు కొట్టి వేయడం జరిగింది అనేది వివరించారు. గిరిజన చట్టాలు అమలు చేయాలని, జిఒ నంబర్ 3 పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, కంగాల శ్రీనివాసరావుదొర, మీడియం శ్రీనివాసరావుదొర, కొవ్వాసి శ్రీనివాసరావు, గొర్లె చిన్న నారాయణరావు, కత్తుల ఆదిరెడ్డి, మడి నెహ్రూ, వంతు బాలకృష్ణ, లోత రామారావు, న్యాయవాదులు సత్యప్రసాద్, రవితేజ, నవీన్, గిరిజన సంఘ నాయకులు శరంకోట అబ్బాయిరెడ్డి, కిట్టుకూరి లక్ష్మణరావు తదితరులు కోరారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, ఐటిడిఎ పిఒను సన్మానించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పిహెచ్ఒ దేవదానం, ఎస్ఒ మార్తమ్మ పాల్గొన్నారు.

రసాయన శాస్త్ర అధ్యాపకులు నియామకం

ప్రజాశక్తి - విఆర్‌పురం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయన శాస్త్రం అధ్యాపక పోస్టును అతిధి అధ్యాపకుల ద్వారా భర్తీ చేయాలని గౌరవ ఇంటర్ విద్యా కమిషనర్ బుధవారం ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ పోస్టుకు సంబంధిత సబ్జెక్టులలో అర్హత గల పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి 50 శాతం మార్కులు కలిగి ఉండి, బోధన అనుభవం కలిగి ఉండాలని, పదవి విరమణ పొందిన, ప్రిన్సిపల్స్, జెఎల్స్, స్కూల్ అసిస్టెంట్స్, ప్రొఫెసర్స్ దరఖాస్తు చేసుకోవాలని అర్హులు లేకపోతే పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసిన వారిచే భర్తీ చేయాలని ప్రిన్సిపల్ సాయిరమణ ఓ ప్రకటనలో తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వట్టిగడ్డ గ్రామ శివారు బ్రదర్ ఫారెస్ట్ సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న సారాబట్టిపై పెమ్మంగి ఎస్ఐ నరసింహామూర్తి సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 50 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారాబట్టి నిర్వహిస్తున్న సింగంపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతను వద్దనుండి 10 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకొని, అడ్డతీగల కోర్టుకు తరలించగా కోర్టు నిందితు డికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నరసింహ మూర్తి తెలిపారు.

ఇద్దరు వైద్యులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: లాగరాయి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గతంలో పనిచేసిన నాగార్జున సస్పెండ్ కావడంతో జడ్డంగి వైద్యాధికారి ఇన్‌చార్జి వైద్యాధికారిగా కొనసాగారు. రోగులు ఇబ్బందుల నేపథ్యంలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం చొరవతో అడిషనల్ శిరీష ఇద్దరు వైద్యాధికారులను యుద్ధప్రాతిపదికన నియమించారు. ఈ సందర్భంగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారులు సతీష్, శరత్ చంద్రలను పిహెచ్‌సి సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. పిఒ అడిషనల్ డిఎంహెచ్‌ఒలను,గ్రామస్తులు అభినందించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, మాథ్స్ పోస్టుల్లో అతిథి అధ్యాపకులను భర్తీ చేసేందుకు ఇంటర్ విద్యా కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం కలిగి టీచింగ్‌లో అనుభవం ఉండి ఉద్యోగ విరమణ పొందిన ప్రిన్సిపల్స్ జేఎల్ స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ప్రిన్సిపల్‌ని సంప్రదించాలన్నారు.

భూ నిర్వాసితులకు ఎకరం భూమి ఇవ్వాలి

సిపిఐ డివిజన్ మహాసభ దృశ్యం

ప్రజాశక్తి - కూనవరం: పోలవరం ప్రాజెక్టు వలన సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించినచోట పనులు లేక ఇళ్లకు తాళాలు వేసుకొని మళ్ళీ సొంత ఊర్లకు వెళ్ళిపోతున్నారని, ప్రభుత్వం ఇల్లు నిర్మించి చేతులు దులుపుకుంటే సరిపోదని అలాంటి భూమిలేని గిరిజన గిరిజనేతర నిర్వాసితులు బతికేందుకు ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వాలని సిపిఐ డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది.

4 మండలాల చింతూరు సిపిఐ డివిజన్ మహాసభ బుధవారం టేకులబోరులో వాసం రాము అధ్యక్షతన జరిగింది. ఈ సభలో జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఒక ఎకరం భూమి ఇవ్వడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు సంకోచిస్తున్నాయని ప్రశ్నించారు.18 సంవత్సరాల నిండిన యువతకు కట్ ఆఫ్ డేట్‌తో సంబంధం లేకుండా ఆర్‌అండ్ఆర్ పునరావాసం కల్పించాలని, చినార్కూరు పంచాయతీ పరిధిలో శ్రీరాంపురం,వెంకన్నగూడెం, కొండరాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తూరు గ్రామాలను నిర్వాసిత జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. మరోసారి చింతూరు డివిజన్ నూతన కార్యదర్శిగా గుజ్జమోహన్‌రావు, సహాయ కార్యదర్శిగా వాసం రాము, ఎస్.కె.రంజాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్యక్రమంలో కూనవరం మండల కన్వీనర్ లంబు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జుత్తుక సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల సమస్యలపై వినతి

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు రామచందేర్‌ని కలసిన ముసిలిబాబు

ప్రజాశక్తి - అడ్డతీగల : ఏజెన్సీ షెడ్యూల్డ్ కులాల సమస్యలపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు రామచందేర్‌ని మాదిగ కుల జిల్లా అధ్యక్షుడు వేమగిరి ముసిలిబాబు రాజమహేంద్రవరంలో కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో షెడ్యూల్డ్ కులాలైన ఆదిఆంధ్ర, మాల, మాదిగ, రెల్లి, సచ్చడి, పైడి, పానో, డోమ్, జంగం, ఘాసిలు కులాలను ఆదిమ గిరిజన తెగలుగా గుర్తించబడ్డాయని, అందులో కొన్ని కులాలు భూబదలయింపుల చట్టం ప్రకారం గిరిజనులుగా గుర్తించబడ్డారని, 1974 ఆగస్టు 19న ఉపాధి మరియు సాంఘిక సంక్షేమశాఖ జిఒ ఎం.ఎస్ 634 ప్రకారం, షెడ్యూల్డ్ కులాలకు వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెల్లం వెంకటరావు వర్సెస్ ఎపి-2000 కేసులో, ఏజెన్సీ ప్రాంతంలో భూమిని కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇళ్లను అందించవచ్చని హైకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. అయితే అది అమలు కావడం లేదన్నారు. ఓటుహక్కు కూడా ఉందని దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులు కలిసి అర్జీలు పెట్టుకున్న స్పందించడం లేదని జాతీయ కమిషన్‌కి వివరించారు. సమస్యలపై స్పందించిన జాతీయ కమిషన్ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న, ఆముదాల సన్నీ పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలి

మాట్లాడుతున్న పి.టాన్యా

ప్రజాశక్తి - రంపచోడవరం : స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలని ఎకెఎంఎస్ జాతీయ నాయకులు పి.టాన్యా డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయం భవనంలో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు డిస్కమ్‌లు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని వినియోగదారులపై మోపిన ట్రూ ఆఫ్ చార్జీల భారాలను రద్దు చేయాలని అదానీ స్మార్ట్‌మీటర్లను వద్దు ట్రూ ఆఫ్ చార్జీలు వద్దు సఖి ఒప్పందం ఆదానికి భూములు అప్పగింత వంటి విధానాలు చంద్రబాబు కూడా ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి దూలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో జెన్‌కో నుంచి విద్యుత్ తీసుకోకుండా ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుండి అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ప్రజలనెత్తిన భారం మోపుతున్నారని దీనిపై ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు లచ్చిరెడ్డి మాట్లాడుతూ 2024 25 సంవత్సరానికి ప్రజల నుండి అధికంగా వసూలు చేసిన రూ.2737 కోట్లు వెంటనే వినియోగదారులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రయివేటు దుకాణాల్లో వ్యవసాయ పరికరాలు కొంటున్న గిరి రైతులు

గిరి రైతులకు అందని రాయితీ పనిముట్లు

ప్రజాశక్తి–చింతపల్లి: గిరిజన ప్రాంత రైతులు ప్రభుత్వ సబ్సిడీ పథకాలపై ఆశలు పెట్టుకుని నిరాశకు గురవుతున్నారు. సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తామని ప్రభుత్వం వాగ్దానం చేస్తున్నప్పటికీ అవి కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయలేదని, ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అయినా రైతుల కష్టాలు తీర్చుతుందన్న విశ్వాసంతో ఎదురుచూస్తున్నామని రైతులు తెలిపారు. ఇటీవల అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటీడీఏ అధికారులు ప్రకటనలు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఆచరణాత్మక చర్యలు ప్రారంభం కాకపోవడంతో రైతులు మరింత ఆందోళనకు గురిచేస్తోందని రైతులు విమర్శిస్తున్నారు. సబ్సిడీ సహాయం లేకపోవడంతో ప్రైవేట్ షాపుల వద్ద అధిక ధరలకు టిల్లర్లు, ఇతర పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని, అప్పులు చేసి కొనుగోలు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో గిరి రైతులకు ఆర్థిక భారం పెరుగుతోందని స్థానికులు అంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సీజన్లో మరింత ఎక్కువ మంది గిరి రైతులు ప్రైవేట్ షాపుల నుంచే వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన రైతులకు రాయితీపై ఆధునిక వ్యవసాయ పనిముట్లు అందజేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

స్టీల్‌ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి –డుంబ్రిగుడ: మండలంలోని తంద్రంగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రేమ బంధు ఫౌండేషన్, రమేష్ మాస్టారు ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ బాలకృష్ణ,గ్రామస్తులు స్టీల్ కంచాలు వితరణగా అందించిన ప్రేమ బంధు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేస్తున్న రమేష్, శ్రీనివాస్ మాస్టార్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ సీతమ్మ తంద్రంగూడ గ్రామస్తులు, పాల్గొన్నారు

దుంబ్రిగుడలో భారీ వర్షం

కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : మండలంలో బుధవారం సాయంత్రం కుండ పోత వర్షం కురిసింది. ఈ వర్షంతో వీధి కాలువలు, రోడ్లు జలమయంగా మారాయి. సాయంత్రం మూడు గంటల వరకు ఎండకాసి, ఆ తరువాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి వర్షం కురిసింది. మారుమూల గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు, ఉద్యోగులు తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడ్డారు.

బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్

సెల్ సిగ్నల్స్‌కు తరచూ అంతరాయం

అవస్థలు పడుతున్న బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ సిగ్నల్‌కు తరచు అంతరాయం ఏర్పడుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు సెకెన్లు సిగ్నల్ ఉండడం గగనమైన పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు పనిచేయకం అవస్థలు పడుతున్నారు. మాట్లాడే సమయంలో అకస్మాత్తుగా సిగ్నల్ కట్ అవుతుండడంతో పూర్తిగా మాట్లాడుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని వినియోగదారులు అంటున్నారు. ఐదు రోజుల నుంచి మండల కేంద్రంలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఇంటర్నెట్ ఉపయోగించే వినియోగదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్ సమస్యతో ఇప్పటికే అనేకమంది బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు జియో నెట్‌వర్క్‌కు మారిపోగా, ప్రభుత్వరంగ సంస్థ అనే అభిమానం, తక్కువ రీఛార్జ్ అనే ఆశతో బిఎస్ఎన్ఎల్‌లో కొనసాగుతున్న వారంతా ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, ఉన్న వినియోగదారులైనా బిఎస్ఎన్ఎల్‌లో కొనసాగాలంటే సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.

మొబైల్ టవర్ల నిర్మాణానికి జాయింట్ సర్వే

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : మొబైల్ టవర్ల నిర్మాణానికి రెవెన్యూ, ఫారెస్టు, నెట్‌వర్క్ అధికారులు జాయింట్ సర్వే చేసి భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. . సెల్ టవర్ల నిర్మాణాలు ఎట్టి పరిస్థితిలోనైనా పూర్తి చేయాలన్నారు. సెల్ టవర్ల నిర్మాణాలకు ప్రభుత్వం నుండి ఒత్తిడి ఉందన్నారు. బుధవారం కలెక్టరేట్ నుండి అటవీ శాఖ రెవెన్యూ, బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో, గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్ (పిఐయు) విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో జిల్లాస్థాయి కమిటీతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాయింట్ సర్వే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సెల్ టవర్ల నిర్మాణాలకు గుర్తించిన భూములపై గ్రామసభలు తీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపించాలన్నారు. . నిర్మాణంలో ఉన్న టవర్లను వేగంగా పూర్తి చేసి, సమాచార వ్యవస్థను మారుమూల గ్రామాలకు అందించాలని అన్నారు. అటవీ ప్రాంతంలో ఎడు జియో, ఐదు బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లకు అటవీ అనుమతులు ఇవ్వాలనారు. గిరిజన సంక్షేమ శాఖ అరకు డివిజన్ పరిధిలో 30 రహదారులకు, 36 రీచ్‌లకు అటవీ శాఖకు ఫారం ఎ పంపించడం జరిగిందన్నారు. 13 పనులకు జాయింట్ సర్వే పూర్తి చేసారన్నారు. అటవీ శాఖ ఫారం బి లో అనుమతులిచ్చారన్నారు. పాడేరు, నర్సీపట్నం డివిజన్ల పరిధిలో అటవీశాఖ అనుమతులకు 15 ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వాటికి జాయింట్ సర్వే పూర్తి చేసారన్నారు. వెంటనే రహదారి నిర్మాణాలు ప్రారంభించాలని చెప్పారు. అనుమతులు జారీ చేసిన పనులు జాప్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు చురుగ్గా పని చేసి రవాణా సౌకర్యాలు మెరుగు పరచాలని సూచించారు. సమావేశంలో పాడేరు డిఎఫ్ఓ పివి. సందీప్ రెడ్డి, అరకు గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె. వేణుగోపాల్, పాడేరు ఎఇ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల పరిశీలన

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇవిఎం గోదామును వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. తనిఖీలో భాగంగా గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు ఏర్పాట్లను పరిశీలించి. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిచారు. అధికారులకు పలు సూచనలు, మార్గదర్శికాలు జారీ చేశారు కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత, డిటిలు సోమేశ్వరరావు, లక్ష్మణమూర్తి, మత్స్య రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

ప్రజాశక్తి –డుంబ్రిగుడ : గంజాయి, మద్యంతోపాటు మత్తు పదార్థాల జోలికి విద్యార్థులు పోవద్దని స్థానిక అరకు సీఐ హిమగిరి సూచించారు. బుధవారం మండలంలోని కించుమండ ఆశ్రమ పాఠశాలలో గంజాయి, మత్తు పదార్థాల వల్ల జరిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ హిమగిరి మాట్లాడుతూ గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెప్పారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. కూలినాలి చేసి కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల పేర్లను సమాజంలో నిలబెట్టే విధంగా విద్యార్థులు మెలగాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి –అనంతగిరి : మండలంలోని కొండిభ పంచాయతీ సింగర్భ, కొండిభ ప్రాథమిక పాఠశాలలో 60. మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పెన్నులు పలకలుతో పాటు విద్యార్థులకు అవసరమైన వస్తువులను మదర్‌థెరిసా సేవ సంఘం, . ప్లాంట్ డోనర్ క్లబ్ సంస్థ అధ్యక్షులు త్యాడ. ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పేద విద్యార్థులకు తమ సంస్థ చేయూతనిస్తుందని అందులో భాగంగా ఏటా పాఠశాలల విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జెవి రాజేష్ పట్నాయక్. పాఠశాల ఉపాధ్యాయులు బిఎస్ఎన్. పడాల్, పార్వతీశం, మాజీ ఎంపిటిసి దయానిధి విద్యార్థులు పాల్గొన్నారు

పొలం గట్లపై కందితో లాభాలు

ప్రజాశక్తి–చింతపల్లి: పొలం గట్లపై కంది విత్తనాలు వేసుకోవడం ద్వారా ప్రధాన పంటకు మేలు జరుగుతుందని, అలాగే అదనపు ఆదాయం సమకూరుతుందని వ్యవసాయ శాఖాధికారి మధుసూదనరావు సూచించారు. బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త తిరుమలరావుతో కలిసి చింతపల్లి మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలో గాడిదలమెట్ట గ్రామాన్ని సందర్శించారు. గిరిజన రైతులు చేపడుతున్న వ్యవసాయ పంటలను పరిశీలించారు. గిరిజన రైతులకు సాగు, సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పొలాల గట్లపై కంది విత్తనాలు వేసుకోవాలని, వేరుసెనగ పంటలో ఎకరానికి 200 కిలోల జిప్సం వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా కొండలరావు

ప్రజాశక్తి–జికె.వీధి : టిడిపి ఎండల అధ్యక్షులుగా పోత్తూరు కొండలరావు, కార్యదర్శిగా పసుపులేటి నాగమణి, ఉపాధ్యక్షుడిగా పాడి శ్రీనివాసరావులను నియమించారు. బుధవారం మండల పరిశీలకులు సుబ్బారావు, పాడేరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి, చైర్‌పర్సన్ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో టిడిపి మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మాజీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కొండలరావు నియామకంపై పల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నూతన కమిటీని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మండల కమిటీని అభినందిస్తున్న నేతలు

ఇన్వర్టర్ అందిస్తున్న జమాల్‌ఖాన్

తహశీల్దార్ కార్యాలయానికి ఇన్వర్టర్ వితరణ

ప్రజాశక్తి– కూనవరం: కూనవరం తహశీల్దార్ కార్యాలయానికి జెకె సిటి ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్‌ఖాన్ రూ20వేల విలువైన ఇన్వర్టర్‌ను తహశీల్దార్ శ్రీనివాసరావుకు బుధవారం అందజేశారు. కొన్ని రోజుల కిందట తహశీల్దార్ శ్రీనివాస్ జమాల్‌ఖాన్‌తో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడి విధులకు తీవ్ర ఆటంకంగా ఉంటుందని చెప్పడంతో ఇన్వర్టర్‌ను జమాల్‌ఖాన్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జహంగీర్, సాల్మన్‌రాజు, నటరాజ్, విఆర్ఒ జల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు

సవలం బుచ్చిబాబుకు నివాళి

ప్రజాశక్తి - చింతూరు: సిపిఎం సీనియర్ కార్యకర్తగా ఏడుగుర్రాలపల్లి మాజీ సర్పంచ్‌గా పార్టీకి పంచాయతీకి విశిష్ట సేవలు అందించిన కామ్రేడ్ సవలం బుచ్చిబాబు మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఏడుగుర్రాలపల్లిలో బుచ్చిబాబు మృతి చెందారని తెలియడంతో ఆయనతో పాటు జిల్లా కమిటి సభ్యులు సురేష్, చింతూరు మండల నాయకులు కారం సుబ్బారావు, మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య సిపిఎం పార్టీ పతాకాన్ని బుచ్చిబాబు పార్థివదేహానికి కప్పి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ మాట్లాడుతూ బుచ్చిబాబు మరణం పార్టీకి తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలను బాగు చేయరూ..!



పైకప్పు ఎగిరిపోయిన చీడిపల్లి పాఠశాల

ప్రజాశక్తి - కొయ్యూరు: బూదరాళ్ల పంచాయితీ పరిధి చీడిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 46 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2014 ఫిబ్రవరిలో పాఠశాల భవననిర్మాణ పనులు పూర్తి చేశారు. అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు రేకులు ఎగిరిపోయాయి. అప్పటి నుండి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖాధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయాలని లేదంటే అదనపు తరగతి గదిని మంజూరు చేయాలని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బోనంగి హరిమూర్తి, సర్పంచ్ ముత్యాలమ్మ తదితరులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవిపై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి - వి ఆర్‌పురం : ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిపై తప్పుడు ఆరోపణలు తగవని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బురక కన్నారావు హెచ్చరించారు. మండల టిడిపి కమిటీ సభ్యులు బుధవారం రేఖపల్లి పార్టీ కార్యాలయంలో కన్నారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్రా నరేష్ మాట్లాడుతూ అవినీతి గురించి మాట్లాడుతున్న వైసిపి మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి నోరు అదుపులో ఉంచుకుంటే మంచిదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసిన మరుసటి రోజునే రైతుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసింది మీ వైసిపి పార్టీ కాదా అని ప్రశ్నించారు. ఇంకోసారి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ సభ్యులు, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: అధికార ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, నియోజకవర్గ టిడిపి యువజన అధ్యక్షులు విజయభాస్కర్‌పై మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు హితవు పలికారు. బుధవారం టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. టిడిపి నేతలు లోతా లక్ష్మణరావు, ముప్పన డింభకేశ్వరరావు, గణజాల తాతారావ్ తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే శిరీష తన సొంత డబ్బుతో పలు కార్యక్రమాలను చేపట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎప్పుడు ప్రజలకు అందుబాటులో లేరని విమర్శించారు. ఇకపై ఎమ్మెల్యే శిరీషదేవి,విజయభాస్కర్ దంపతులపై నిరాధార ఆరోపణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : అధికారి పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు తమపై విమర్శలు చేస్తున్నారని నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని రంపచోడవరం టిడిపి నాయకులు అడబాల బాపిరాజు హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఐదు సంవత్సరాలు చేసిన అభివృద్ధి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తే ఓర్వలేక అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఉపాధ్యక్షుడు సలాది బాపిరాజు, టిడిపి నాయకులు అనంత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) విశాఖ యూనిట్ పూర్తి కార్యవర్గాన్ని విశాఖశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎం.కీర్తన్, జెవికె అప్పలరాజు బుధవారం ప్రకటించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో భవిష్యత్తులో విశాఖ యూనిట్ సభ్యుల సంక్షేమానికి చేపట్టబోయే కార్యక్రమాలు, యూనిట్ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తతంగా చర్చించారు. గ్రేటర్ విశాఖలో జాప్ యూనియన్‌ను బలమైన యూనియన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. నగరంలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కీర్తన్, అప్పలరాజు నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. గౌరవ సలహాదారులుగా పిఆర్ పాత్రుడు, డివి సత్యనారాయణ, ఎన్.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

అగ్ని ప్రమాద బాధితునికి చేయూత

బియ్యం అందిస్తున్న సర్పంచ్ నాగమణి

ప్రజాశక్తి– కూనవరం: మండలంలోని పెద్దార్కుర్ పంచాయతీ లోని గండికొత్తగూడెం గ్రామానికి చెందిన తెల్లం వెంకయ్య ఇల్లు జూన్‌లో దగ్ధమైంది. స్వచ్ఛంద సంస్థల వారు ఆయుర్వేద డాక్టర్ జమల్కాన్ కుటుంబానికి 10 రేకులు, 10 రాడ్లు ఆర్థికంగా సహాయం చేశారు. కొంతమంది స్వచ్ఛంద సంస్థలకు సంబంధించి వారు కూడా ఆ కుటుంబానికి తమకు తోచిన సహాయం అందించారు. గ్రామానికి చెందిన ప్రభుత్వోద్యోగులు కూడా తమవంతు రూ.8వేలు ఆర్థిక సహాయం అందించారు. కూనవరం సిపిఎం శాఖ, రేపాక శాఖ నుండి వారికి తోచిన సహాయాన్ని అందించారు. ప్రభుత్వం 25 కేజీల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకోకుండా పక్కా ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని పెద్దార్కుర్ సర్పంచ్ నాగమణి డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య మండల కార్యదర్శి బాబు బోరయ్య, మండల కమిటి సభ్యులు పోడియం రామారావు, తెల్లం తమ్మయ్య, మడకం సత్యనారాయణ, తొండ లక్ష్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచినీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి - కూనవరం: మండలంలోని పెద్దఆర్కుర్ పంచాయతీ పరిధిలోని గండికొత్తగూడెం గ్రామంలో తాగునీటి పథకాన్ని సర్పంచ్ నాగమణి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద ఆర్కుర్ పంచాయతీలోని అన్ని గ్రామాల్లో తాగునీటి మోటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించడం జరుగుతోందన్నారు. గతంలో గండికొత్తగూడెం గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తెలుసుకుని అధికారులకు వినతిపత్రాలు అందించామన్నారు. దీని ఫలితంగా జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి పథకాన్ని మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య , వార్డు మెంబర్లు మండల గిరిజన సంఘం నాయకులు పోడియం రామారావు, తెల్లం తమ్మయ్య, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగమణి

శామ్‌సంగ్ స్మార్ట్ మానిటర్లపై ఆఫర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శామ్‌సంగ్ ఇండియా ఎం9, ఎం8, ఎం7 స్మార్ట్ మానిటర్లపై ఆకర్షణీయమైన ఆఫర్లను ఇవ్వనున్నట్లు శామ్‌సంగ్ కంపెనీ హెడ్ ఆదిత్య తెలిపారు. ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. వినియోగదారుల కోసం ప్రత్యేకలాంచ్ ఆఫర్లు ఈ నెల 20 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. రూ. 3 వేల వరకు తక్షణ పొదుపును పొందవచ్చు అన్నారు.ఈ సిరీస్‌లో ఫ్లాగ్‌షిప్4కె క్యూడి, ఒఎల్ఈడి మానిటర్ ఉండటంతో, వినియోగదారులు ఒకే పరికరంలో వీక్షణ, వర్క్, గేమింగ్ అనుభవాలను సులభంగా ఆస్వాదించవచ్చు అన్నారు.

ఇగ్నో అడ్మిషన్లకు గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై 2025 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువు జూలై 31వ తేదీ వరకూ పొడిగిస్తున్నామని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది. ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా లేదా కింద ఇవ్వబడిన లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. https://ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌లోచూడవచ్చు. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు పొందే వీలుంది.. ఫీజులు కూడా ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సులలో ఎస్‌సి, ఎస్‌టి. విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ విశ్వవిద్యాలయం కల్పిస్తోంది.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళలు తమ స్వశక్తితో ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందని, అల్లూరి విజ్ఞాన కేంద్రం పరిశోధన విభాగం ఇంచార్జ్ కె.పద్మ అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 మెషిన్లతో ప్రారంభించిన కుట్టుశిక్షణ కేంద్రం డిమాండ్లను అనుసరించి మిషన్ల సంఖ్యను పెంచడం జరుగుతోందన్నారు. ఈ శిక్షణ కేంద్రం మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జి.ఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ విజ్ఞాన కేంద్రంలో ఇప్పటికే ప్రజల సౌకర్యార్థం ఫ్రీ మెడికల్ క్యాంపు, ఫ్రీ క్లినిక్ నిర్వహించడమే గాక కంప్యూటర్ శిక్షణ కూడా అందిస్తోందని ఇప్పుడు టైలరింగ్ శిక్షణ కూడా తోడైందని చుట్టుపక్కల ఉన్న మహిళలు పెద్దఎత్తున టైలరింగ్ శిక్షణ పొందేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అల్లూరి కార్యక్రమాల కమిటీ సభ్యులు బుజ్జి మాట్లాడుతూ మరికొన్ని రోజుల్లో యోగా శిక్షణ కూడా ప్రారంభిస్తున్నామని సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. టైలరింగ్ శిక్షణ పొందాలనుకునేవారు పి.ఎన్.మణి 8330948949 ఫోన్ నంబర్‌ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎం.ఆర్.డి.రాజు, వై.సత్యనారాయణ, మహిళా నాయకురాలు కె.మణి పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అభ్యంతరం కాని అనధికారిక ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ భవనంలో వేర్వేరుగా జరిగిన విశాఖపట్టణం, భీమిలి రెవెన్యూ డివిజన్ల కాన్ఫరెన్స్‌లలో పలు అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జిఒ 30 ఉద్దేశాలను, ఆవశ్యకతలను జిఒ ప్రకారం 2019 అక్టోబర్ 15 ముందు జరిగిన ఆక్రమణలను పరిగణనలోకి తీసుకొని ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. సచివాలయాల వారీగా జాబితాలను ప్రచురించాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులు, పిజిఆర్ఎస్‌కి వచ్చిన వినతుల పరిష్కారంలో చొరవ చూపాలని ఆదేశించారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో పారదర్శకంగా పని చేయాలని చెప్పారు. భూముల క్రమబద్ధీకరణ విషయంలో చురుగ్గా వ్యవహరించాలన్నారు. ఆక్రమణల వివరాలను ప్రతి సచివాలయం పరిధిలో ప్రదర్శించాలని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, సర్వే శాఖ ఎడి సూర్యారావు, కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు, డిటిలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.